# రంగుతగ్గిన జీవితం

నోయిడా నుంచి ఆగ్రా వచ్చాను. ఆగ్రాలో మీటింగ్‌లు, సెమినార్లు, వర్క్‌షాపులు అయ్యాయి. బిజీ బిజినెస్ విషయాలు టెన్షన్.

రెండోరోజు ఫైనాన్స్, టెక్నికల్, ఆపరేషన్స్, సేల్స్ మార్కెటింగ్ మానేజర్లతో మీటింగ్‌లు అన్నీ అయ్యాయి. మళ్లీ బిజీ, మళ్లీ టెన్షన్.

ఒకటే తలనొప్పి. కానీ తప్పదు. ఆరోజున సి.ఎన్.బి.సి. ఛానెల్ కోసం ఇంటర్వ్యూ ఉంది. మానేజ్‌మెంట్ కోర్సులో సీటుల పెంచాలా అన్న దానిమీద. అయింది అది.

తలనొప్పితో అలాగే రోజంతా గడిపాను. బిబిసి కోసం సిద్ధార్థ బాసు నిర్వహిస్తున్న బిజినెస్ క్విజ్ కోసం వెళ్తున్న మా కెంపెని వాళ్ళని కలవాల్సి వచ్చింది.

అక్కడ కూడా ఇదే విషయాలు. సెన్సెక్స్ ఆరువేలకి వస్తుందా? జి.డి.పి. 7.5 శాతం పెరుగుతుందా! ఎస్సార్ కంపెనీని రూయాలు రక్షించుకో గలుగుతాయా! అన్ని చోట్లా బిజినెస్, బిజినెస్.

మళ్లీ విసుగు. ఏవిటీ జీవితం!

ఆరంకెల జీతం. దానికి తగ్గ జీవితం. అయితేనేం బతుకు మట్టుక్కు నాటకీయం. లాభనష్టాల బేరీజులతో చుట్టూచేరే చుట్టాలు, స్నేహితులు. వీటినుంచి రిలీఫ్ కావాలి.

ఈ జంటిల్మెన్ సిండ్రోం నుంచి దూరంగా వెళ్ళాలి.

మెహఫిల్‌లో డిన్నర్ అయ్యి రూంకొచ్చి పక్కమీద వాలాను.

సృజన లండన్ నుంచి ఫోన్ చేసింది.

"కలలు కంటున్నారా!" కిలకిలా నవ్వుతూ అంది సృజన.

"అవును"

"ఈ ప్రపంచం కలలు కనే వాళ్ళది. చిన్నప్పుడు డబ్బు లేకపోయినా జేబునిండా కలలు పోసుకునే వాణ్ణి. చరిత్ర సృష్టించిన వాళ్ళంతా ఒకప్పుడు కలలు కనే వాళ్ళే నన్న సంగతి తెలుసా నీకు. అయినా నీకెందుకులే..." నవ్వాను.

"సరే...మీ కలల గురించి నేను ఎప్పుడూ వింటున్నదే కదా... ఇవాళ కొత్తా!" మళ్ళీ కిలకిలా నవ్వింది.

"నవ్వకు...కలలకి ఎంత శక్తి ఉందో చూడు. రెండువందల ఏళ్ళున్న అమెరికా పూర్తి ప్రపంచం రూపుమార్చడం లేదా! పెళ్ళికి ముందు నువ్వు కలలు కన్లేదా!"

"బాబూ! మీకు ఓ నమస్కారం. మేము భోంచెయ్యడానికి బయటికి వెళ్తున్నాము. నాలుగు రోజులు స్విట్జర్లాండ్‌లోనే ఉంటాము. మీరు కలల కంటూ నిద్రపోండి..."

"అప్పుడే మీకు భోజనం టైమయిందా! పిల్లలేం చేస్తున్నారు?"

"పిల్లలకి మీరు గుర్తుకే రావడం లేదు. మహేశ్వరి పిల్లలు, వీళ్ళు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. వాళ్ళకి మొదట్నించీ ఏడు గంటలల లోపు అన్నం తినడం అలవాటు. మీరు యింట్లో సాయంత్రం ఏనాడైనా ఉన్నారా? వాళ్ళు ఎప్పుడు అన్నం తింటారో తెలీడానికి!" నిష్ఠురంగా అంది.

"నువ్వు దేనికి? అందుకే కదా!" అన్నాను గట్టిగా నవ్వుతూ.

"అవును. నేనందుకే. మీరు మీ కలల్ని నిజం చేసుకోడానికి ఏం పోగొట్టుకుంటున్నారో మీకిప్పుడే తెలీదు. ఓ.కె.పడుకోండి. కలలు కనండి" అంటూ పెట్టేసింది.

ఒక్కసారి నిశ్శబ్దం. చిన్నప్పట్నించి నాకున్న కల ఏవిటి? ఐ.ఐ.టి.

నాకు ఐ.ఐ.టి.లో సీటు రావాలి. అదే ధ్యేయం. ఎంత కష్టపడి చదివానో. సీటు వచ్చింది. ఖరగ్‌పూర్‌లో చదివాను. రెండేళ్ళు ఉద్యోగం చేసాకా అహ్మదాబాద్‌లోని మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో మార్కెటింగ్‌లో చేరాను. వెంటనే ఉద్యోగం వచ్చింది. నేను పనికి బానిసనే. ఎప్పుడూ బిజీ. చెన్నై, ముంబై, బెంగుళూరు, ఢిల్లీ, గుర్‌గావ్,

కలకత్తా వీటి చుట్టూ తిరుగుతూ నెలకి ఇరవయ్యారు రోజులు గడిపేస్తాను. ఆ మిగిలిన నాలుగు రోజులు యింటి దగ్గరున్నా కూడా ఆఫీసు పనే. అందుకే సృజన అస్తమానం నన్ను వేళాకోళం పట్టిస్తుంది.

"ఎప్పుడూ అలా యంత్రంలా ఎలా ఉంటారు?" అని అంటూంది సృజన.

నవ్వేసి ఊరుకుంటాను.

"శని, ఆదివారాలైనా ఉండండి. ఊళ్ళో **ఉండేది** చాలా తక్కువ. అప్పుడైనా ఉండి జీవితాన్ని గడపకపోతే ఎలా! అంత డబ్బు సంపాదించాలా! మీరు మరీను..."

"పని చెమట, కష్టపడటం, యివన్నీ డబ్బు కోసమే అనుకుంటే ఎథిక్స్‌కే అవమానం. మనం చేసే ప్రతీపని సమాజానికి ఏమైనా యిస్తోందా. మనం మానసికంగా ఎదుగుతున్నామా అన్న ప్రశ్నలు వేసుకున్నప్పుడు సమాధానం పాజిటివ్‌గా ఉంటే చేస్తున్న పనికి న్యాయం చేకూర్చిన వాళ్ళ అవుతాము" నా భావాలు సృజనకి అర్థంకావు.

"ఇల్లు, తిండి పంచుకుంటున్నాం. ఫీలింగ్స్‌ని పంచుకున్నామా! మీ యిష్టం నేను పిల్లలు ప్రపంచం అంతా చూసి వస్తాము"అంటూ సృజన నన్ను నా మానానా వదిలేసింది. తను పిల్లల్ని తీసుకుని సెలవలు విదేశాల్లో గడిపి వస్తూంటుంది.

ఎప్పుడు నిద్ర పట్టిందో నాకే తెలీదు.

అలవాటుగా ఐదు గంటలకే లేచి ఎక్సర్‌సైజులు చేసి, రూము బయటికొచ్చాను. అన్నింటికీ దూరంగా, అన్నింటినీ వదిలి వెళ్ళాలనుకున్నాను.

ఎనిమిది గంటలకి టూరిజం వాళ్ళు ఏర్పాటు చేసిన లగ్జరి బస్సులో ఆగ్రా చూడటానికి సీటులో కూచున్నాను.

ఎందుకో కారులో వందిమాగధుల్లాంటి వాళ్ళతో వెళ్ళానిపించలేదు. నేను ఒక్కణ్ణే వెళ్ళాలనుకున్నాను. ఒక్కరోజు ఫ్రీగా ఉండాలనుకున్నాను.

నా పక్కనే నడివయసు దాటిన మనిషి కూచున్నాడు. అతన్ని నేను ముందు పెద్దగా పట్టించుకోలేదు. రాన్రాను అతను ఇంట్రెస్టింగా అనిపించాడు.

తెల్లజుట్టుతో, తెల్లటి మనిషి, నల్ల కళ్లజోడు.

తల ఎత్తి ఓ కోణంలోనే చూస్తున్నాడు. కదలిక లేదు.

ఏదైనా మెడిటేషన్, యోగా చేస్తున్నాడా? అలా చలనం లేకుండా ఒకే వైపు ఎలా చూడగలుగుతున్నాడు?

కాసేపట్లోనే అర్థం అయింది అతనికి కళ్లు లేవని. అతని పక్కనే వున్న కర్ర చెప్పింది ఆ సంగతిని.

బస్సు ఆగింది. ఆగ్రా కోటకొచ్చాము. నేను చాలాసార్లు చూసాను. అందుకని చూడడానికి పెద్ద ఇంటరెస్ట్ చూపించలేదు.

"ఎక్స్‌క్యూజ్ మీ" అన్నాడు నా పక్కనున్నాయన.

"చెప్పండి"

"ఆగ్రా కోటకే వచ్చినట్టున్నాం. నాకు కొంచెం దాని గురించి చెప్పండి. మిగిలిన వాళ్ళతో వెళ్లడానికి నేను మామూలు వాడిని కాదు."

"అలాగే దానికేం వుంది. నేను చాలాసార్లు చూసాను. ఏ రంగులో ఉందో కంద మెత్తగా ఎందుకుందో అన్నీ వివరంగా చెప్తాను" ఉత్సాహంగా అతనికి గైడునైపోయాను.

మధ్యలో అన్నాడు ఓ యాక్సిడెంటులో కళ్లుపోయాయని. మిగిలిన నాలుగు ఇంద్రియాలతో ప్రయాణాలు చేస్తూ ఆనందిస్తున్నానని అన్నాడు.

పెద్దగా చరిత్ర తెలీకపోయినా ఏదో తెలిసింది చెప్తూంటే అతను చాలా శ్రద్ధగా వింటున్నాడు.

"లంచ్ మీతోపాటు కూచుని చేస్తే మీకేమైనా అభ్యంతరమా?"

"ఇద్దరం కలసి తిందాం" నాకు సరదాగా ఉంది ఈ స్నేహం.

కొత్త అనుభవం. ఊహించని అనుభవం. హోటలు దగ్గర బస్సు ఆగింది.

బస్సు దిగాకా అతని మోచేయిని పట్టుకున్నాను.

అతను వదిలించుకున్నాడు. తలపైకెత్తి భుజాలు వెనక్కి విరిచి నడుస్తూంటే నేనే ఆయన వెనకాల నడుస్తూ ఆయన్ని అనుసరిస్తున్నట్టుగా ఉంది.

"లోపల ఎలా ఉందో చెప్తారా?" అంటూ నా వైపుకి చెవి దగ్గరా ఉంచాడు.

కాంతి ఎక్కువగా లేని ఆ హాలుని, గోడలు, వాటికున్న తైలవర్ణచిత్రాలు, తెరలు అన్నింటిని మెల్లగా నాకు చాతనైనంతగా చక్కటి పదాలు ఉపయోగించి వర్ణించి చెప్పాను.

లంచ్ ఆర్డర్ చేసాను.

కూరలు, ప్లేట్లు, టేబుల్ మీదున్న గళ్లున్న బట్టని, రెండు ఆకులతో ఉన్న ఎర్రగులాబీని, ఏదీ మర్చిపోలేదు. అన్నీ విడమర్చి చెప్పాను.

నేనేవిటో, నా టెన్షన్‌లు అన్నీ మర్చిపోయాను. అతని సహాయకుడిగా ఉన్నాను. నా మానసిక స్థితి ఏవిటో మర్చిపోయాను.

"బ్యాండ్ వాయిస్తున్నట్టున్నది. వాళ్ల బట్టలు, వాళ్ల వాయిద్యాలు చెప్పగలుగుతారా" నా వైపు చెవినుంచాడు.

నల్లటి వదులుగా ఉన్న బాగీ పాంట్లు, తెల్లటి ఫుల్ చేతులున్న చొక్కాలు, వాళ్లు వాయిస్తున్న వాయిద్యాలు అన్నీ చెప్పాను.

ఆ తర్వాత తాజ్‌మహల్ చూడ్డానికెళ్లాను.

ఆ పెద్ద ద్వారం, దగ్గర నుంచి తాజ్‌మహల్‌ని చూడగానే, ఒళ్లు ఒక్కసారి జలదరించింది. నోరు తెరుచుకుని అలాగే ఆ కాలం చెక్కిలి మీద కన్నీటి బొట్టుని చూస్తుండిపోయాను.

ఇది వరకు ఎన్నోసార్లు వెళ్లాను. విదేశీయుల్ని తీసుకుని, స్వదేశీయులతో కలిసి కానీ, నాకెప్పుడు ఇంత అద్భుతంగా అనిపించలేదు.

రంగులు మారుతున్న ఆకాశం నేపథ్యంలో రంగు తగ్గుతున్న తాజ్‌మహల్‌ని చాలా ఉత్సాహంగా చెప్పాను. ఎరుపులోకి దిగిపోతోంది ఆకాశం. నలుపుగా అయిపోతున్న తాజ్‌మహల్ ఇంతందమా సాయంత్రానికి!

ఆ రాత్రి హోటల్ లాబీలో ఇద్దరం నుంచున్నాం.

అతను తన చెయ్యిచాపి నా చెయ్యి పట్టుకున్నాడు.

ఓ క్షణం అయ్యాకా తడుముతూ మోచేతి వరకూ ఆ తర్వాత మెల్లగా భుజాల వరకూ వెళ్లి ఆగాడు.

అతని కర్ర శబ్దం చేస్తూ కింద పడింది.

కర్ర తీసే ప్రయత్నం చెయ్యలేదు.

బదులుగా నన్ను పట్టుకున్నాడు.

"నీ పేరు అడగలేదు. కళాదృష్టి ఉన్న మనిషివి. నీ వయసు నాకు తెలీదు. తెలుసుకోవాలని లేదు. మంచి అభిరుచికి వయసుతో పనేంటి?"

"ప్రతీ విషయాన్ని, ఎంతో నిశితంగా, ఎంతో అందంగా చక్కటి కోణంలోంచి చూసి, మంచి ఈస్థటిక్ సెన్స్‌తో చూసి, నీ కళ్లతో నాకు మనోనేత్రంపై చూపించావు!

ఓ అపురూపమైన కళాఖండాన్ని ఎంతో అందంగా ఊహించుకోగలిగేలాగా చెప్పావు. ఈ ట్రిప్‌ని నేనెప్పటికీ మరిచిపోలేను. చాలా థాంక్స్."

అతను ఎప్పుడెళ్లిపోయాడో నాకు తెలీదు. ఓ గుడ్డివాడు నా మనసుకి కప్పిన పొరల్ని ఎంతందంగా, ఎంత సునాయాసంగా తొలిగించాడు. ఈ ప్రపంచాన్ని, అందులోని రంగుల్ని నాకు తెలీకుండానే స్పృశించే శక్తిని నాకు నేర్పించాడు. ప్రతీ చిన్నదానిలో కూడా అందాన్ని చూడడం చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఎలా మరిచిపోవచ్చో చూపిం చాడు. నిజానికి నేనే ఆయనకి కృతజ్ఞత చెప్పుకోవాలి.

జీవితానికి ఏవిటి జోడించాలో, ఇంతవరకూ నేనేవిటి పోగొట్టుకున్నానో ఎంతో సులువుగా చెప్పివెళ్లిపోయాడు.

గదిలోకి వెళ్లకుండా వెనక ఉన్న లాన్స్‌వైపు వెళ్లాను. వీచే గాల్లో తేల్తున్న సంగీతం చెవులకి మొట్టమొదటిసారిగా వినపడింది.

✧ *18.3.2005* **ఆంధ్రభూమి వారపత్రిక** ✧